సాక్షి
శ్రీకాకుళం

శనివారం । 4 । జనవరి । 2025



సృజనకు సలామ్

విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు అబ్బురపరిచాయి. విద్యార్థులు అదరగొట్టారు.

- IIలో



కొలువే లక్ష్యం

ఖాకీ కొలువే లక్ష్యంగా అభ్యర్థులు కష్టపడ్డారు. ఎంపికల్లో రాణించారు.

- IIలో

రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ 2, 4 సెమిస్టర్ల రీవాల్యుయేషన్ ఫలితాలను అధికారులు శుక్రవారం విడుదల చేశారు. జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. త్వరలో మార్కుల జాబితాలు విద్యార్థులకు అందజేయనున్నారు.

న్యూస్‌రీల్

రథసప్తమి లోగో రూపకల్పనకు ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: అరసవల్లి రథసప్తమి వేడుకలను ప్రతిభావంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఈ వేడుకలకు ప్రత్యేక లోగో రూపకల్పనకు ఔత్సాహికులను ఆహ్వానిస్తూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం ప్రకటించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో వేడుకల నిర్వహణకు సంబంధించి విస్తృతంగా చర్చించారు. వేడుకలకు ముందు జిల్లా వ్యాప్తంగా సూర్యనమస్కారాలు నిర్వహించే కార్యక్రమం, శ్రీకాకుళంలో రాష్ట్రస్థాయి క్రీడలు, నగర వీధులలో శోభాయాత్ర వంటి కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించారు. లక్షలాది భక్తులు తరలి వచ్చే ఈ వేడుకలకు పార్కింగ్, లేజర్ షో, నమూనా దేవాలయాల ప్రదర్శన, సీసీ కెమెరాలు, మంచినీటి సౌకర్యం, ప్రసాదాల కౌంటర్లు, రవాణా సౌకర్యాలు, వసతి సౌకర్యాలు వంటి అన్ని అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. మరుసటి వారం నిర్వహించే సమీక్షలో ఫ్రంట్ లైన్ ఆఫీసర్లందరూ వారి వారి ప్రణాళికలతో హాజరుకావాలని సూచించారు. రథసప్తమిని తొలిసారి మూడు రోజులపాటు జిల్లాలో నిర్వహించనుండటంతో ఎక్కడా పొరపాట్లకు తావు లేకుండా విజయవంతం చేయడానికి కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సమావేశంలో డీఆర్‌ఓ వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం ఆర్డీఓ సాయి ప్రత్యూష, డీఎస్పీ సీహెచ్ వివేకానంద, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, అరసవెల్లి ఈఓ వై.భద్రాజీ, జిల్లా ఫైర్ ఆఫీసర్ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ మాకివలస భూములపై కలెక్టర్‌కు నివేదిక



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ సాయి ప్రత్యూష

జలుమూరు: మర్రివలస పంచాయతీ పరిధి ఎస్టీ మాకివలస పంచాయతీ భూములు, గ్రామ సమస్యలపై కలెక్టర్‌కు నివేదించనున్నామని శ్రీకాకుళం ఆర్డీఓ సాయి ప్రత్యూష అన్నారు. శుక్రవారం మాకివలసలో గ్రామస్తులు, రైతులతో మాట్లాడారు. ఈ గ్రామ సమస్యలు జాతీయ నేషనల్ కమిషన్ దృష్టిలో ఉన్నందున పూర్తిస్థాయి పరిశీలన చేస్తున్నామన్నారు. గ్రామంలో మౌలిక వసతులు, భూముల రికార్డులు పరిశీలించారు. ఆమెతో పాటు తహసీల్దార్ జెన్ని రామారావు, మండల సర్వేయర్ నాగేశ్వరరావు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేధింపుల పర్వం




It has been found that MPDOs and MCs are not taking up inquiries against the PDFs. My office is also calling up and we are find issues. Action would be initiated against the MCs and MPDOs who has not conducted inquiry and submitted ATR 17:22

+91 98499 03786

These are PDFs where not even a single pension has been given at the door step

300 మీటర్ల లోపు పింఛన్లు పంపిణీ చేయలేని వారిపై విచారణ జరపాలని ఆదేశిస్తూ వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేసిన కలెక్టరేట్ అధికారులు

- సచివాలయ ఉద్యోగులపై సర్కారు కక్ష
- 300 మీటర్ల లోపు పింఛన్లు పంపిణీ చేయలేదని షోకాజ్ నోటీసులు
- సాంకేతిక సమస్యలు పట్టించుకోకుండా నోటీసులు జారీ
- ఇప్పటికే సర్వేలతో ఉక్కిరిబిక్కిరి
- ఇప్పుడు పింఛన్ల పంపిణీతో ఇబ్బందులు
- తలకుమించిన భారంతో ఒత్తిడికి గురవుతున్న సచివాలయ ఉద్యోగులు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : సచివాలయ వ్యవస్థ, అందులోని సిబ్బందిపై కూటమి ప్రభుత్వం అక్కసు వెళ్లగక్కుతూనే ఉంది. అవకాశం దొరికిన ప్రతిసారీ సిబ్బందిని ఇరుకున పెడుతూనే ఉంది. ఇప్పటికే రకరకాల సర్వేలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న సచివాలయం ఉద్యోగులకు పింఛన్ల పంపిణీ కొత్త తలనొప్పులు తెచ్చి పెడుతోంది. పంపిణీ సమయంలో సర్వర్ సమస్యలు, గంట గంటకి పై నుంచి వస్తున్న ఒత్తిళ్లు, జియో ట్యాగింగ్‌తో నెల కొన్న ఇబ్బందుల నేపథ్యంలో కొందరి లబ్ధిదారులకు 300మీటర్ల దాటి పింఛన్లు పంపిణీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఉన్నతాధికారులు సంబంధిత సచివాలయం ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి ఆందోళనకు గురి చేస్తున్నారు.

సాంకేతిక సమస్యలు ఉన్నా..

వైఎస్ జగన్ ప్రభుత్వంలో 50 ఇళ్లకొక వలంటీర్ ఉండటంతో సకాలంలో పింఛన్ల పంపిణీ జరిగేది. కూటమి ప్రభుత్వం వచ్చాక వలంటీర్లను పూర్తిగా తీసేసింది. దీంతో పింఛన్ల పంపిణీ బాధ్యతలను సచివాలయం ఉద్యోగులకు అప్పగించింది. ఈ అదనపు బాధ్యత సచివాలయ ఉద్యోగులకు తలకు మించిన భారమై కూర్చొంది. వాస్తవానికి రోజంతా పింఛన్ల పంపిణీ చేసే అవకాశం ఉంది. కానీ వలంటీర్లు లేని లోటు కనబడకూడదని సచివాలయం ఉద్యోగులకు పింఛన్ల పంపిణీ టార్గెట్ ఇస్తోంది. వారికి అప్పగించిన పింఛన్లను నిర్దేశించిన రోజున 5.30 నుంచే పంపిణీ చేయాలని చెప్పడం, 6గంటల్లోపు పంపిణీ ప్రారంభం కాకపోతే సంబంధిత గ్రూపుల్లో నాట్ స్టార్టెడ్ అని పెట్టి, వీరిపై చర్యలు తీసుకుంటామని గ్రూపులోనే పెట్టడం, ఆ తర్వాత గంట గంటకి ఎంత మందికి ఇచ్చారని అధికారుల నుంచి ఫోన్లు రావడంతో సచివాలయం ఉద్యోగులను ఒత్తిడికి గురి చేస్తోంది. వాస్తవానికైతే ఆ రోజంతా పంపిణీ చేయవచ్చు. కానీ ప్రభుత్వ పెద్దల మెప్పు కోసం హడావుడి చేస్తున్నారు. ఇదే సమయంలో హౌస్ హోల్డ్‌జియో లోకేషన్ చేసినప్పుడు టెక్నికల్ సమస్యలు వస్తున్నాయి. పీడీఓ నెట్‌వర్క్ సరిగా లేకపోవడం వల్ల లొకేషన్‌లో మార్పులు చూపిస్తోంది. వేరే ఊరి పింఛను ట్రాన్స్‌ఫర్ అయి వీరి దగ్గరకు రావడం, ముసలి వాళ్ల సంరక్షకుని ఇంటి దగ్గర ఉండటం ఒకచోటైతే వాళ్ల ట్యాగింగ్ ఇంకో చోట ఉండటం, ఉపాధి నిమిత్తం వేరే చోట్ల ఉండటం తదితర కారణాలతో పలువురికి 300 మీటర్ల లోపు పింఛన్లు ఇవ్వలేని పరిస్థితి నెలకొంటోంది. కానీ అధికారులు ఇవేమీ పట్టించుకోకుండా సచివాలయం ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నారు. ఆ నోటీసులు కూడా వాట్సాప్ గ్రూపుల్లోనే పెడుతున్నారు. దీంతో సిబ్బంది మరింత ఆందోళనకు గురవుతున్నారు.



కోటబొమ్మాళి మండలంలో నలుగురికి ఎంపీడీఓ జారీ చేసిన షోకాజ్ నోటీసు

భయపెడుతున్న సంఘటనలు

- పింఛన్ల పంపిణీ కోసం స్టేట్‌బ్యాంకు నుంచి రూ. 24.63లక్షల నగదు విత్‌డ్రా చేసుకుని వెళ్తుండగా ఆ మధ్య రాజీవ్ స్వగృహ కాలనీ వద్ద ఎస్ఎం పురం వెల్ఫేర్ అసిస్టెంట్‌పై గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు పల్సర్‌బైక్ వచ్చి, ఇనుప రాడ్‌తో దాడి చేసేందుకు యత్నించారు. వెల్ఫేర్ అసిస్టెంట్ చాకచక్యంతో తప్పించుకుని, సురక్షితంగా బయటపడ్డారు.
- ఎచ్చెర్ల మండలంలోని కుప్పిలి వ్యవసాయ సహాయకుడు మురళి పింఛన్లు పంపిణీ చేసేందుకు వస్తుండగా ఎచ్చెర్ల సమీపంలో బైక్ పై నుంచి పడిపోయాడు.
- పింఛన్లు పంపిణీ చేసేందుకు తెల్లవారు జామున ఆమదాలవలస నుంచి ఫరీదు పేట వస్తుండగా వ్యవసాయ సహాయకురాలు రేవతి కూడా స్కూటర్ పై వస్తుండగా ఆమదాలవలస వంతెన వద్ద పడిపోయారు.
- ప్లాన్ లేకుండా అక్రమంగా ఇళ్లు నిర్మిస్తున్న వ్యక్తికి నోటీసు ఇచ్చేందుకు వెళ్లిన సచివాలయం అసిస్టెంట్‌పై కీలక ప్రజాప్రతినిధి అడ్డు తగలడమే కాకుండా అవమానపరిచారు. అక్రమంగా నిర్మాణం చేపడుతున్న వ్యక్తికి ఇవ్వాల్సిన నోటీసును లాక్కొని, అందరి ముందు చించేసి అధికార దర్పం చూపించారు. దీంతో ఆ ఉద్యోగి అవమానభారంతో వెనుదిరిగారు.

మానసిక ఒత్తిడి



ఇప్పటికే విధుల్లో ఒత్తిడితో సచివాలయం ఉద్యోగులు మానసిక ఒత్తిడికి లోనై అనారోగ్యానికి గురవుతున్నారు. ఇప్పటికే పలువురి మరణించారు. కొందరైతే ఆత్మహత్య చేసుకుంటున్నారు. ముఖ్యంగా సర్వేలతో ఒత్తిడి ఎక్కువగా ఉంది. ప్రాథమిక వ్యవసాయ సర్వే, ప్యాక్ సర్వే, మైక్రో, మీడియం స్కేల్ సర్వే, ఎలక్ట్రికల్ మీటర్ సర్వే, మిస్సింగ్ హౌస్ హోల్డ్ సర్వే, మరుగుదొడ్లు సర్వే, ప్రజా ఫిర్యాదులపై వెరిఫికేషన్(పీజీఆర్ఎస్) సర్వే, ఎన్‌పీసీఐ లింక్(బ్యాంకు లింక్), ప్రభుత్వ స్టిక్కర్లు అంటించడంతో పాటు పన్నుల బాధ్యతలు కూడా సచివాలయం ఉద్యోగులకు అప్పగిస్తున్నారు. ఇవి కాకుండా దైనందిన కార్యక్రమాలు ఉండనే ఉంటున్నాయి. వీటిన్నింటినీ ఉద్యోగులు తట్టుకోలేక పోతున్నారు. ఇలాంటి ఒత్తిళ్లతో ఇటీవల విశాఖపట్నం సిటీలో ఒక సచివాలయం ఉద్యోగి గుండెపోటుతో మరణించారు.



టార్గెట్ పెట్టి.. టార్చర్ చేసి

సచివాలయం వ్యవస్థే టార్గెట్‌గా ప్రభుత్వం పనిచేస్తున్నట్లు స్పష్టమవుతోంది. సచివాలయం ఉద్యోగులను ఈ ప్రభుత్వం తొలి నుంచి చిన్న చూపు చూస్తోంది. కనీసం ప్రభుత్వం ఉద్యోగులు అని చూడకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తోంది. సచివాలయం ఉద్యోగులను దాదాపు వలంటీర్లుగా మార్చేసింది. జిల్లాలో 7,800 మంది వరకు ఉన్న ఉద్యోగులంతా ఇప్పుడు అంతర్మథనం చెందుతున్నారు. ప్రతి చిన్న పనికి సచివాలయం ఉద్యోగులే ప్రభుత్వానికి కన్పిస్తుండటంతో పనిభారం తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మహిళా ఉద్యోగులైతే మరింత ఇబ్బందులు పడుతున్నారు. టార్గెట్లు కూడా పెట్టడంతో తట్టుకోలేకపోతున్నారు.

ప్రశాంతత కరువు

సచివాలయం ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, చోటు చేసుకుంటున్న ప్రమాదాలతో మానసిక ప్రశాంతతను కోల్పోతున్నారు. రకరకాల ఆలోచనలు, టెన్షన్లతో అనారోగ్యాలకు గురవుతున్నారు. మరోవైపు నాయకుల వేధింపులు, కక్ష సాధింపులతో టార్చర్ అనుభవిస్తున్నారు. ఇవన్నీ తట్టుకోలేక కొందరు చనిపోవడం, మరికొందరు ఆత్మహత్యలకు సిద్ధపడటం కలకలం రేపుతోంది. జరుగుతున్న పరిణామాలతో ఉద్యోగులు బెంబెలెత్తిపోతున్నారు. ఇది చాలదన్నట్టు తాజాగా పింఛన్ల విషయంలో షోకాజ్ నోటీసులు రావడం మరింత ఆందోళనకు గురి చేస్తోంది.

పార్టీలకు అతీతంగా సంక్షేమం అందాలి

- జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పిరియా విజయ



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, చిత్రంలో సీఈఓ శ్రీధర్‌రాజా

అరసవల్లి: జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమం అందించేలా చర్యలు చేపట్టాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పిరియా విజయ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన స్థాయీ సంఘ సమావేశాల్లో ఆమె అధ్యక్షత వహిస్తూ మాట్లాడారు. జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పంచాయతీ రాజ్, గ్రామీణ నీటిసరఫరా, ఆర్అండ్‌బీ, విద్యుత్, జిల్లా పంచాయతీ, గృహనిర్మాణశాఖ తదితర శాఖల ప్రగతిపై సమీక్షించారు. జెడ్పీ 2వ, 4వ, 1వ, 7వ స్థాయీ సంఘ సమావేశాలకు ఆమె అధ్యక్షత వహించి అధికారుల ప్రగతి నివేదికలను పరిశీలించారు. పలు శాఖల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ అధికారులు తీరు మార్చుకోవాలని సూచించారు. గత ప్రభుత్వంపై విమర్శలను మానుకుని ప్రస్తుత ప్రభుత్వం పరిపాలనపై దృష్టి సారిస్తే మంచిదని హితవు పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ స్పందిస్తూ గత ప్రభుత్వంలో అభివృద్ధి పేరిట అక్రమాలు జరిగాయని, త్వరలోనే అవినీతిని బయట పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టనుందని తెలియజేశారు. అలాగే పల్లెల్లో ఈ ప్రభుత్వం మార్క్ కనిపించేలా అభివృద్ధి చేసి చూపిస్తుందని ప్రకటించారు. నరసన్నపేట ఎమ్మెల్యే రమణమూర్తి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అధికారులు పర్యవేక్షణ మరింత పెంచాలని సూచించారు. క్షేత్రస్థాయిలో కొందరు అధికారులు స్పందన సరిగ్గా లేదనే విమర్శలు వస్తున్నాయని గుర్తు చేశారు. అంతకు ముందు 3వ స్థాయీ సమావేశాన్ని లావేరు జెడ్పీటీసీ మీసాల సీతంనాయుడు అధ్యక్షతన, 5వ సంఘ స్థాయీ సమావేశాన్ని వీరఘట్టం జెడ్పీటీసీ జంపు కన్నతల్లి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట,ఆమదాలవలస ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, కూన రవి కుమార్, పలుశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వేషధారణ..భేష్



సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. శ్రీకాకుళం హయాతీనగర్‌లోని ఎంజేపీఏపీబీసీఆర్‌డబ్ల్యూ బాలికల పాఠశాలలో విద్యార్థినులు ఇలా వేషధారణలతో ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి అభినందించారు.

– శ్రీకాకుళం న్యూకాలనీ

చలికాలపు కానుక



వివిధ ఆకృతుల్లో షాపులో అమ్మకాలకు సిద్ధంగా ఉన్న ముప్ప చెక్కీలు

ఉద్దానం తోటలపై తెల్లగా పరచుకునే పొగమంచు, పల్లె కోవెలలో తెల్లవారుజామున వినిపించే పాశురాలు, వీధి అరుగులపై ముచ్చటగా కనిపించే రంగవల్లులు.. ధనుర్మాస ఆగమనానికి ప్రతీక. ఇవే కాదు ఇంకో గుర్తు కూడా ఉంది. అదే నెయ్యి చెక్కీ. నెలగంటు పెట్టాక నెయ్యి చెక్కీ రుచి చూడాలంటారు. ఈ నెలన్నర సీజన్‌లో అధికంగా దొరికే నెయ్యి చెక్కీ చలికాలపు కానుక. సంక్రాంతి వరకు మార్కెట్‌లలో విరివిగా లభిస్తుంది.

- ఉద్దానంలో నోరూరించే చెక్కీలు
- కొత్త ధాన్యం పేలాలతో ధనుర్మాస చెక్కీ
- నెలన్నర పాటు అమ్మకాలు

ఇచ్ఛాపురం రూరల్:

సూర్యుడు ధనస్సు రాశిలోకి ప్రవేశించిన మొదలు మకర సంక్రాంతి(పెద్ద పండగ) వరకు ఉత్కళాంధ్ర పల్లెలు తీపి రుచిని చూస్తాయి. ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామాల్లోని 'గుడియా' 'నెయ్యిల' కులాలకు చెందిన వారు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పండించిన కొత్త ధాన్యంను సేకరించి వాటిని పేలాలుగా మార్చి అందులో నెయ్యి, బెల్లం, చక్కెరను కలిపి పాకం చేస్తారు. వేడివేడిగా పొగలు చిమ్మే ఈ పాకాన్ని వివిధ ఆకృతుల్లో అమర్చి చెక్కీలుగా తయారు చేస్తారు. చెక్కీలపై అలంకరణ కోసం ఎండు కొబ్బరి ముక్కలను సన్నగా తరిగి అతికిస్తారు. వీటితో పాటు పోషక విలువలు గల కిస్మిస్, బాదం పప్పు, జీడి పప్పు బద్దలను అలంకరిస్తారు. ధనుర్మాసం మొదలు మకర సంక్రాంతి వరకు ప్రతి రోజు విష్ణుమూర్తి, జగన్నాథ స్వామి వారికి నైవేద్యంగా ఈ చెక్కీలను పెడతారు. కేవలం ధనుర్మాసంలోనే తయారు చేసే ఈ చెక్కీలను 'ధనుర్ముప్ప' అని కూడా పిలుస్తారు.

దోస్తీలకు దొన్ను చెక్కీ..

ఉత్తరాంధ్ర పల్లెల్లో నేస్తరికం అనే అపురూప సంప్రదాయం ఉంది. నేస్తరికం కట్టుకుంటే ఇక పేర్లు పెట్టి పిలవడం ఉండదు. నేస్తం అంటూ జీవితాంతం పిలుచుకుంటారు. నేస్తరికం, మిత్తరికం, మొఖరా, సాంగాతి, దోస్తీ, వరిపండు, ముళ్లు వంటి పేర్లతో పిలుచుకుంటూ వారి స్నేహాన్ని మరింత బలపరుచుకుంటారు. ఈ సందర్భంగా తమ స్నేహం దృఢంగా, ప్రేమానుబంధాలుగా ఉండేందుకు ముప్ప చెక్కీని బహుమతిగా ఇవ్వడంతో పాటు కొత్త బట్టలు కానుకగా ఇస్తారు. అత్తారింటిలో ఉన్న ఆడ పిల్లను సంక్రాంతి పండక్కి పిలుపు చేసేందుకు బంధువులు 'ముప్ప చెక్కీ'ని తీసుకువెళ్లి కానుకగా అందజేయడం ఉత్కళాంధ్రుల ఆచారం.

మూడు నెలలు నిల్వ

ధనుర్మాసం మొదలు మకర సంక్రాంతి వరకు ఒడిశాతో పాటు ఉత్తరాంధ్రలోని అన్ని స్వీట్, పాన్ షాపుల్లో విరివిగా అమ్మకాలు జరుగుతుంటాయి. మూడు నెలలు పాటు నిల్వ ఉండే ఈ ముప్ప చెక్కీలు మార్కెట్‌లో రూ.50 నుంచి రూ.600 వరకు లభిస్తున్నాయి. ఇందులో బెల్లంతో తయారీ చేసిన చెక్కీలు, పంచదారతో తయారు చేసిన నేతి చెక్కీలు ఉంటాయి.

అమ్మకాలు జోరందుకున్నాయి



ప్రస్తుతం ధనుర్మాసం మొదలు కావడంతో మా షాపులో ముప్ప చెక్కీల అమ్మకాలు జోరందుకున్నాయి. గ్రాముల నుంచి కేజీల్లో నేతి చెక్కీలను అందరికీ అందుబాటు ధరలో అమ్మకాలు చేస్తుంటాము. ముఖ్యంగా బరంపురం చెక్కీలకు మంచి గిరాకీ ఉంటోంది. మా షాపు నుంచి ఇతర రాష్ట్రాలకు చెక్కీలు వెళ్తుంటాయి.

– గుడియా బబ్లూ, తయారీదారు, ఇచ్ఛాపురం

ఆరోగ్య ప్రదాయిని..

బెల్లం, పంచదారతో తయారు చేసిన ఈ ముప్ప చెక్కీని శీతాకాలంలో తింటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముప్ప చెక్కీ తయారు చేసిన సమయంలో అందులో కొబ్బరి, జీలకర్ర, సోపు, జీడిపప్పు, బాదం పప్పు, ఎండు ద్రాక్ష, నెయ్యి వంటి పోషక పదార్థాలు ఉండటం వల్ల అన్ని రకాల వయస్సు గల వారు తింటే రక్త ప్రసరణ, జీర్ణక్రియ బాగా జరుగుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.



మరో ఫిర్యాదు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : జిల్లాకేంద్రంలో ఇటీవల శ్లాబ్ నిర్మాణం చేపడుతున్న దంపతులను అర్ధరాత్రి బెదిరించి రూ.లక్ష డిమాండ్ చేసిన పత్రికా విలేకరుల్లో ఒకరైన తిత్తి ప్రవీణ్‌పై టూటౌన్ పోలీసులకు మరొకరు ఫిర్యాదు చేశారు. నగరంలోని పాండురంగవీధికి చెందిన ఎంవీ మల్లేశ్వరరావు ఈ ఫిర్యాదు ఇచ్చారు. 2023 డిసెంబరు 12న ఓ కేసు విషయమై అదే పోలీస్ స్టేషన్‌కు ఎంవీ మల్లేశ్వరరావు వెళ్లగా స్టేషన్ ఆవరణలో తిత్తి ప్రవీణ్ దౌర్జన్యంగా దాడి చేసి గాయపర్చడమే కాక అవమానపరిచాడు. దీనిపై అదే రోజు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మెడికల్ లీగల్ కేసు రిపోర్టు అయ్యింది. కానీ దీనిపై పోలీసులు చర్యలు తీసుకోలేదు. దీంతో చర్యలు తీసుకోవాలని కోరుతూ మల్లేశ్వరరావు జనవరి 2న పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయం సీఐ ఈశ్వరరావు వద్ద ప్రస్తావించగా ఇది నాన్ కాగ్నిజుబుల్ (గుర్తించదగనిది) కనుక న్యాయస్థానానికి మెమో ఫైల్ చేశామని, న్యాయస్థానం ఉత్తర్వులు రావాల్సి ఉందని అన్నారు.

ఫాల్స్ కేసు

పైన చెప్పిన కేసులో ఫిర్యాదు దారైన ఎంవీ మల్లేశ్వరరావు, ఈశ్వరరావు అనే మరో వ్యక్తి కలిసి తనను బెదిరించారని రెండో పట్టణ పోలీసులకు ఈనెల 2న బిడ్డిక రాజారావు అను వ్యక్తి ఫిర్యాదు చేశాడు. దీనికి సంబంధించిన వివరాల్లోకి వెళ్తే.. గత ఏడాది డిసెంబర్ 31న ఉదయం 7 గంటలకు నగరంలోని ఆర్‌కే స్టేడియం సమీపంలో తనను బెదిరించారని బిడ్డిక రాజారావు ఈనెల 2న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే పోలీసులు శుక్రవారం ఇరు వర్గాలను పిలిపించి సీసీ కెమెరాలను పరిశీలించారు. ఫిర్యాదులో పేర్కొన్న సమయంలో రాజారావు ఆ పరిసరాల్లో కనిపించకపోవడంతో కేసును ఫాల్స్ కేసుగా పరిగణించినట్లు సీఐ చెప్పారు.

నేటి నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎండీఎం అమలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ పేరిట శనివారం నుంచి మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయనున్నారు. జిల్లాలో 38 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 11,200 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఎండీఎం పథకం అమల్లోకి వస్తుండటంతో వీరంతా కళాశాలల్లోనే మధ్యాహ్న భోజనాలు చేయనున్నారు. సమీప ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి కళాశాలల్లోని విద్యార్థులకు అవసరమయ్యే భోజనాలను వివిధ పాత్రలతో తీసుకుచ్చి అందించనున్నారు. జిల్లాలో శ్రీకాకుళం బాలురు, శ్రీకాకుళం బాలికలు, గార, కింతలి, తొగరాం, ఆమదాలవలసతోపాటు నరసన్నపేట, కోటబొమ్మాళి, టెక్కలిలోని కళాశాలల్లో సెంట్రలైజ్డ్ కిచెన్ అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా భోజనాలు అందించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇంటర్ విద్య డైరెక్టర్ ఆదేశాలు, జిల్లా కలెక్టర్ సూచనల మేరకు ఎండీఎం అమలుకు అవసరమైన అన్నిచర్యలు పకడ్బందీగా తీసుకున్నామని డీవీఈఓ శివ్వాల తవిటినాయుడు పేర్కొన్నారు. కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులతో ఎలాంటి సహాయక కార్యకలాపాలు చేపట్టవద్దని ఆయన స్పష్టంచేశారు.

డయాలసిస్‌కు వెళ్తున్నారా..?



కాశీబుగ్గ: పలాసలో ప్రభుత్వ కిడ్నీ పరిశోధన కేంద్రంకు డయాలసిస్ చేసుకోవడానికి వెళ్తున్న ప్రతి ఒక్క పేషెంట్ ఎవరి డబ్బులతో వారు ఇంజెక్షన్ కొనుగోలు చేసుకోవాలని కొత్త ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఆస్పత్రి మూడో అంతస్తులో ఉన్న నెఫ్రోప్లస్ యూనిట్‌లో డయాలసిస్ యూనిట్‌కు వచ్చిన వారికి యాంటీబయోటిక్ ఇంజెక్షన్ తీసుకురమ్మంటున్నారు. గత ప్రభుత్వంలో ఇలాంటి ఇక్కడే అందించేవారు. ఇప్పుడు మాత్రం కొని తీసుకురమ్మంటున్నారు. ఇవే కాకుండా కిడ్నీ ఆస్పత్రిలోని అనేక విభాగాల్లో అనేక వస్తువులు, మందులు, రక్తపరీక్షలు అన్నీ ప్రైవేటుగా ఆధారపడాల్సి వస్తోందని నిరుపేద కిడ్నీ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కిడ్నీ పరిశోధన కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజను వివరణ కోరగా ఆస్పత్రిలో అడ్మిట్ అయినవారికి ప్రభుత్వం తరఫున అందిస్తున్నామని నెఫ్రోప్లస్ డయాలసిస్ యూనిట్‌లో ఇంజెక్షన్ కొనుగోలు చేయమంటున్నారంటే తమ పరిధిలో లేదని అన్నారు.

సృజనాత్మకతకు సలాం

- అబ్బురపరిచిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు
- మూడు కేటగిరిల్లో రాష్ట్రపోటీలకు ఎంపిక



రాష్ట్రపోటీలకు ఎంపికైన వివిధ ప్రాజెక్టుల విద్యార్థులు, టీచర్లతో విద్యాశాఖాధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ:

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకను ఉపాధ్యాయులే గుర్తించి, వారిని ప్రోత్సహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. శుక్రవారం శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనను జేసీ ప్రారంభించారు. జిల్లాలోని వివిధ యాజమాన్యాల ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రాజెక్టులతో అబ్బురపర్చారు. డిసెంబర్ 30న జిల్లా వ్యాప్తంగా మండలస్థాయిలో విద్యార్థి, విద్యార్థుల గ్రూపు, టీచర్ కేటగిరీల్లో జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రాజెక్టులు జిల్లా పోటీల్లో పాల్గొన్నాయి. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అధికారులతో కలిసి పోటీలను, విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా 916 ప్రాజెక్టులు మండలస్థాయి పోటీల్లో రూపొందించారని డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. వీటిల్లో ఉత్తమమైన ప్రాజెక్టులను మండలస్థాయిలో ఎంపిక చేయగా అందులో 93 ప్రాజెక్టులను జిల్లాస్థాయికి ఎంపిక చేసినట్లు వివరించారు.

ఆరు ప్రాజెక్టులు రాష్ట్రపోటీలకు ఎంపిక..

ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లాస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనల్లో విద్యార్థులు ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. జ్యూరీ సెలక్షన్ కమిటీ ఫైనల్‌గా ఎంపికచేసిన 6 ప్రాజెక్టులను రాష్ట్ర పోటీలకు ఎంపిక చేసినట్లు ప్రాజెక్ట్ నోడల్ అధికారి, ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి తెలిపారు. విజయవాడ వేదికగా ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు రాష్ట్రపోటీలు జరుగుతాయని చెప్పారు. విజేతలకు సుడా చైర్మన్ కొరకాన రవికుమార్, డీఈఓ తిరుమల చైతన్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ సంపతిరావు శశిభూషణ్, జిల్లా సైన్స్ అధికారి ఎస్.కుమారస్వామి, అసిస్టెంట్ కమిషనర్ లియాఖత్ అలీఖాన్, డీవైఈఓ విలియమ్స్, పేడాడ దాలినాయుడు, హెచ్‌ఎంలు, సైన్స్ టీచర్లు, జ్యూరీ కమిటీ తదితరులు పాల్గొన్నారు.

పునరుత్పాదక బ్రేకుల వ్యవస్థ..



పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి జశ్వంత్ పాత్రో 'పునరుత్పాదక బ్రేకుల వ్యవస్థ' పేరిట ప్రాజెక్టును తీర్చిదిద్దాడు. ఫిజికల్ సైన్స్ టీచర్ జె.షణ్ముఖరావు గైడ్ టీచర్‌గా వ్యవహరించారు. మెకానికల్ ఎనర్జీని ఎలక్ట్రిక్ ఎనర్జీగా ఈ ప్రాజెక్టుతో కన్వర్ట్ చేయవచ్చు. విద్యుత్ నిల్వ కావడంతోపాటు ఖర్చు, కాలం ఆదా అవుతుందని, గ్లోబల్ వార్మింగ్ తగ్గుతుందని నిరూపించిన ఈ ప్రాజెక్ట్ 'స్టూడెంట్ వ్యక్తిగత విభాగం'లో మొదటిస్థానంలో నిలిచి రాష్ట్రపోటీలకు ఎంపికైంది.

లిక్విడ్-3(ట్రీ)తో పర్యావరణ హితం..



పురుషోత్తపురం ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి పాండవ దీపక్‌కుమార్ లిక్విడ్-3 పేరిట లిక్విడ్ ట్రీ ప్రాజెక్టును సన్నద్ధంచేశాడు. ఫిజికల్ సైన్స్ టీచర్ పి.వెంకటరావు గైడ్‌గా వ్యవహరించారు. ద్రవం చెట్టుగా ఉండేలా మైక్రో యాల్గి(నాచు) టెక్నాలజీని వాడి రూపొందించారు. అర్బన్ పరిధిలో ఈ చెట్లు అధికంగా ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి. దీనివల్ల కాలుష్యం తగ్గుతుంది. పర్యావరణం మెరుగుపడుతుందని నిరూపించిన ఈ ప్రాజెక్ట్ 'స్టూడెంట్ వ్యక్తిగత విభాగం'లో రెండో స్థానంలో నిలిచి రాష్ట్రపోటీలకు ఎంపికైంది.

సుస్థిర వాననీటి నిర్వహణ..



వర్షపునీటిని వృథా చేయకుండా నిల్వచేయడంతో కూడిన సుస్థిర వాననీటి నిర్వహణ పేరిట సంతబొమ్మాళి ఎంజేపీఏపీబీసీడబ్ల్యూ బాలుర రెసిడెన్షియల్ స్కూల్‌కి చెందిన విద్యార్థులు ఎ.దీపక్, ఎ.శివహరీష్, ఎన్ని చిరంజీవి తీర్చిదిద్దిన ప్రాజెక్ట్.. జ్యూరీ కమిటీని విశేషంగా ఆకట్టుకుంది. పీజీటీ పీఎస్ ఉపాధ్యాయురాలు ఎ.సుధ గైడ్‌టీచర్‌గా వ్యవహరించారు. భూగర్భంలో గ్రౌండ్‌వాటర్‌గా నిల్వచేసి, ట్యాంకుల్లో నిల్వచేసి, అవసరమైనప్పుడు వర్షపునీటిని తాగడంతోపాటు వివిధ రకాల పనులకు ఉపయోగించవచ్చని నిరూపించారు. 'స్టూడెంట్ గ్రూప్ కేటగిరి'లో మొదటిస్థానంలో నిలిచి రాష్ట్రపోటీలకు ఎంపికైంది.

కాంతి, విద్యుదయస్కాంత బోధన



మెట్టవలస జెడ్పీ హెచ్‌స్కూల్‌లో ఫిజికల్ సైన్స్ టీచర్‌గా పనిచేస్తున్న బి.వెంకటరావు తీర్చిదిద్దిన ప్రాజెక్టు టీచర్ విభాగంలో మొదటిస్థానంలో నిలిచి రాష్ట్రపోటీలకు ఎంపికైంది. 'కాంతి, విద్యుదయస్కాంత బోధనకు సరికొత్త బోధనా పరికరాలు' పేరిట ఈయన రూపొందిన ఈ ప్రాజెక్టుతో విద్యుదయస్కాంత తత్వం, తరంగాల ఉనికి విద్యార్థులు సులభంగా తెలుసుకోవచ్చని నిరూపించారు. తక్కువ ఖర్చుతో దీనిని రూపొందివచ్చని జ్యూరీ కమిటీకి వివరించి మెప్పించారు.

సమగ్ర వ్యవసాయ పద్ధతి..



ఎకరా భూమిలో ఏడాదికి లక్ష రూపాయలు ఆదాయం సమకూర్చుకునే రైతు ఈ ప్రాజెక్ట్ ద్వారా ఏడాదికి మూడు రూ.లక్షల వరకు ఆదాయం పెంచుకోవచ్చని ఎచ్చెర్ల మండలం సంతసీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎ.దమయంతి, బి.శరణ్యశ్రీ నిరూపించారు. హెచ్‌ఎం జయలక్ష్మి, గైడ్ టీచర్ బి.అనూరాధ ప్రోత్సాహంతో ఈ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టారు. సమీకృత వ్యవసాయం ద్వారా రైతులు అనేక రకాల పంటలను ఒకే చోట పండిస్తే తుఫానులు, వర్షాల సమయంలో కొన్ని పంటలు పాడైనా మిగిలిన పంటలను రక్షించుకోవచ్చని ప్రాజెక్ట్‌తో తెలియజేశారు. ఎక్కువ మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉండటం, యూత్‌ని కూడా ఆకర్షిస్తుందని తెలిపే ఈ ప్రాజెక్టు.. 'స్టూడెంట్ గ్రూపు కేటగిరి'లో ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్ర పోటీలకు ఎంపికైంది.

'ఆంత్రోబోట్'తో బాసటగా..

మానవాలి శరీరానికి, ఆరోగ్యానికి ఎంతో ఉపయుక్తంగా ఉండేలా ఆంత్రోబోట్ ప్రాజెక్ట్ ద్వారా అబ్బురపరిచేలా ఆకట్టుకున్నారు శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాల బయలాజికల్ సైన్స్ టీచర్ కె.శ్యామ్‌సుందరరావు. ఈ ప్రాజెక్ట్ ద్వారా శరీరంలోపల గాయాలను నయం చేయవచ్చు. క్యాన్సర్‌ను గుర్తిస్తుంది. ధమనుల లోపల కొవ్వును నిరోధిస్తుంది. డీఎన్ఏను మార్చాల్సిన అవసరంలేదు. గాయం వద్ద నాడీకణాల ఉత్పత్తిని పెంచి గాయాన్ని నయం చేస్తుంది. రోగనిరోధక కారకాలను ఉపయోగించే అవసరం భవిష్యత్తులో లేకుండా చేస్తుందని వివరించి మెప్పించారు. టీచర్ కేటగిరి విభాగంలో రెండోస్థానంలో నిలిచిన ఈ ప్రాజెక్టు రాష్ట్రపోటీలకు ఎంపికైంది.



మహిళాభ్యున్నతికి సావిత్రిబాయి పూలే కృషి వెలకట్టలేనిది


సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దుంపల లక్ష్మణరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే మహిళల అభ్యున్నతికి చేసిన కృషి వెలకట్టలేనిదని వైఎస్సార్‌సీపీ కళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు దుంపల రామారావు (లక్ష్మణరావు) అన్నారు. శ్రీకాకుళం నగరంలో ఓ ప్రయివేటు కార్యాలయంలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ విద్య ద్వారానే స్త్రీకి విముక్తి లభిస్తుందనే దృఢ సంకల్పంతో బాలికా విద్య ఉద్యమానికి పునాది వేసిన గొప్ప సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే అని కొనియాడారు. మహిళలు ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సనపల నారాయణరావు, గరికయ్య, తిర్లంగి లోకనాథం, టి.శంకరరావు, రౌతు గోవిందరావు, భోగ పాపన్నయాదవ్, తమిరి శంకరరావు, సనపల రామకృష్ణ, అంధవవరపు శ్రీనివాసరావు, మున్సీ, కైన చిన్నారావు, గురుగుబెల్లి పెంటన్నాయుడు, కూన పాపారావు, డి.గోవిందరావు,డి. ధర్మారావు, సింహాచలం గౌడ తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో కక్షసాధింపులు

- దాడికి గురైన ఎంపీటీసీని పరామర్శించిన తిలక్
- అండగా ఉంటామని భరోసా


ఎంపీటీసీ సుధాకర్‌ను పరామర్శిస్తున్న పేరాడ తిలక్, నాయకులు

టెక్కలి: సంతబొమ్మాళి మండలం నౌపడలో శుక్రవారం జరిగిన పంచాయతీ సమావేశంలో టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడి టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంతబొమ్మాళి మండలం నౌపడ-2 ఎంపీటీసీ సభ్యుడు బచ్చల సుధాకర్‌ను వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ పరామర్శించారు. దాడికి గల కారణాలను తెలుసుకున్నారు. అనంతరం తిలక్ మాట్లాడుతూ ఆరు నెలల కూటమి పాలనలో ఘోరంగా వైఫల్యం చెందారని, దీనిపై ప్రజల తరఫున నిలదీస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడం తగదన్నారు. టెక్కలి నియోజకవర్గంలో పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు అండతో టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోతున్నారని మండిపడ్డారు. ఒకే సామాజిక వర్గానికి చెందిన పోలీస్, రెవెన్యూ అధికారులు సైతం ప్రజలకు రక్షణ కల్పించకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. ఈ విషయంలో అధికారులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఇటీవల కోటబొమ్మాళి మండలం యలమంచిలి పంచాయతీ మామిడివానిపేటలో ఓ నిరుపేద కుటుంబానికి చెందిన ఇంటి పునాదులు కక్ష సాధింపుగానే కూల్చివేసే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో అధికారులు అన్ని రకాల నిబంధనలతో లబ్ధిదారులకు ఇంటి స్థలం ఇచ్చారని, ఇప్పుడు జియోట్యాగింగ్ నెపంతో పునాదులు కూల్చేవేసే కుట్రపై టీడీపీ నాయకుల ప్రమేయం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. సంతబొమ్మాళి మండలం ఉమిలాడలో జగనన్న లేఅవుట్‌ను టీడీపీ కార్యకర్తలు ఆక్రమించే ప్రయత్నాన్ని అధికారులు ఎందుకు అడ్డకోవడం లేదని తిలక్ ప్రశ్నించారు. టీడీపీ కార్యకర్తల చెప్పు చేతల్లో కీలుబొమ్మలుగా మారి ఇబ్బందులు పడవద్దని అధికారులకు హితవు పలికారు. టీడీపీ నాయల కక్ష సాధింపు చర్యలకు బలైపోతున్న ప్రతిఒక్కరికీ అండగా పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తిలక్ భరోసానిచ్చారు. కార్యక్రమంలో నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, సర్పంచ్ ఆర్.జయమోహన్, నాయకులు ఎ.రాహుల్ పాల్గొన్నారు.

యురేకా సైన్స్ ఎక్స్‌పో-2025 పోస్టర్ ఆవిష్కరణ

శ్రీకాకుళం: జనవిజ్ఞాన వేదిక నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రయోగాల వినూత్న పోటీలు (యురేకా సైన్స్ ఎక్స్‌పో) 2025 ను విజయవంతం చేయాలని డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య అన్నారు. శుక్రవారం నగరంలోని జిల్లా సైన్స్ ఎగ్జిబిషన్‌లో డీఈఓ, సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, డిప్యూటీ డీఈఓలు ఆర్.విజయకుమారి, పి.విలియం, ఎగ్జామ్ కమిషనర్ లియాకత్ అలిఖాన్, జిల్లా సైన్స్ అధికారి నల్లకుమార్ స్వామి జేవీవీ యురేకా సైన్స్ ఎక్స్‌పో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేవీవీ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రయోగాల వినూత్న పోటీల్లో పాల్గొనాలని, భవిష్యత్ శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. శాస్త్రీయ ఆలోచన, శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలన్నారు. పూలే జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాలల లెక్చరర్లు పోలినాయుడు, రాధాకృష్ణ, రుద్రమదేవి, జిల్లా హెచ్‌ఎంల అసోసియేషన్ వి.సత్యనారాయణ, ఎ.వాసుదేవరావు, పి.దాలినాయుడు పాల్గొన్నారు.

చెక్‌బౌన్స్ కేసులో వ్యక్తికి జైలుశిక్ష

శ్రీకాకుళం పాతబస్టాండ్: చెక్ బౌన్స్ కేసులో ఓ వ్యక్తికి మూడు నెలల జైలు శిక్షను ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి విధించారు. శ్రీకాకుళం నగరానికి చెందిన టి.శోభారాణి రూ.3 లక్షల చెక్‌ను టి.సురేష్ కుమార్‌కు అందజేశారు. బ్యాంకులో చెక్ చెల్లక పోవడంతో ఆయన కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు మూడు నెలల జైలు శిక్ష, రూ.2.50 లక్షల మొత్తాన్ని చెల్లించకపోతే మరో నెల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల ధర్నా


ధర్నా చేస్తున్న ఇంజనీరింగ్ విభాగ కార్మికులు


శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీఓ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.అమ్మన్నాయుడు, శ్రీకాకుళం నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, ఇంజినీరింగ్ విభాగం జిల్లా కన్వీనర్ రాణా శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్-ఎంప్లాయిస్ ఫెడరేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ధర్నా చేపట్టారు. అనంతరం కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి. ప్రసాదరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం అధ్యక్షులు పి.త్రినాథరావు, పి.మణికంఠ, ఆర్.గిరిజాశంకర్, పేట.శ్రీకాంత్, ఆర్.రమేష్ బాబు, పి.సోమేష్, పి.శాంతి, ఎస్.సురేష్, ఎం.శ్రీనివాసరెడ్డి, గొండు ఆదినారాయణ, ఎం.ఎస్.రాములు, చిన్నమడు, జి.లక్ష్మి, జయమ్మ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో సిక్కోలు జోరు


పతకాలు సాధించిన క్రీడాకారులతో రాజా, కోచ్

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర స్థాయి క్యాడెట్ ఫెన్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. కాకినాడ వేదికగా జరిగిన ఈ పోటీల్లో అండర్-17 విభాగం బాలుర కేటగిరీలో ఫాయిల్ టీం విభాగంలో పిల్ల సునీల్, కె.దుర్గాప్రసాద్, సిమ్మ యశ్వంత్, బొక్కెల హర్షలు కాంస్య పతకాలు సాధించారు. సాబర్ టీం విభాగంలో పీస హర్షిత్ రామ్‌చరణ్, కొంద్రు హేమసుందర్, వజ్రపతి రాజేష్ కాంస్య పతకాలు సాధించారు. ఇప్పి టీం బాలికల విభాగంలో ధనాల జోష్ని, రోషిత, దుర్గ భవాని, రాజేశ్వరిలు రజత పతకాలు సాధించి శభాష్ అనిపించారు. క్రీడాకారులను శుక్రవారం టౌన్‌హాల్‌లో జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బలభద్రుని రాజా అభినందించారు. ఎన్ఐఎస్ కోచ్ జోగిపాటి వంశీ సేవలను మెచ్చుకున్నారు.

రసాయనాల లీకేజీపై మాక్‌డ్రిల్


ఉద్యోగులను రక్షిస్తూ..

రణస్థలం: రసాయనిక పరిశ్రమల్లో మిథనాల్ సాల్వెంట్ వంటి రసాయనాలు లీకై నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తూ శుక్రవారం పైడిభీమవరం పారిశ్రామికవాడలోని ఏపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్-4లో మాక్‌డ్రిల్ నిర్వహించారు. జిల్లా డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పైపులైన్ నుంచి మిథనాల్ సాల్వెంట్ లీకవ్వడం, వెంటనే అరికట్టడం వంటి చర్యలను సిబ్బంది కళ్లకు కట్టినట్లు చూపించారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి జె.మోహన్‌రావు, ఫ్యాక్టరీస్ మేనేజర్ మదన్‌కుమార్, రణస్థలం అగ్నిమాపక అధికారి పైల ఆశోక్, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, భద్రత అధికారి సంపత్ రెడ్డి, హెచ్‌ఆర్ అడ్మిన్ అధికారి కమలాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


అభ్యర్థి ఎత్తు పరిశీలన


లాంగ్ జంప్ చేస్తున్న అభ్యర్థి

కొలువే లక్ష్యం

ఎచ్చెర్ల ఆర్మ్‌డు రిజర్వు మైదానంలో ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మహిళా అభ్యర్థులకు పరీక్షలు నిర్వ హించారు. 587 మంది అభ్యర్థులను పిలవగా 317 మంది హాజరయ్యారు. వీరికి ఎత్తు, బరువు, 1600 మీటర్లు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ ఈవెంట్‌లు నిర్వహించగా 118 మంది తుది రాత పరీక్షకు అర్హత సాధించారు. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, పోలీసు అధికారులు పర్యవేక్షించారు. - ఎచ్చెర్ల క్యాంపస్


అభ్యర్థులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి


పరుగెడుతున్న మహిళా అభ్యర్థులు

క్లుప్తంగా

విస్తృతంగా తనిఖీలు



బస్సులో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న ఎస్ఐ

సారవకోట: మండలంలోని టోల్‌గేట్ సమీపంలో శుక్రవారం ఎస్ఐ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఒడిశా నుంచి ఆంధ్రాలోని పలు ప్రాంతాలకు గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు రవాణా అరికట్టేందుకు పాతపట్నం నుంచి వచ్చే ట్రావెల్స్ బస్సులను క్షుణ్ణంగా తనిఖీ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లగేజీ ఆటో బోల్తా

బూర్జ: మండలంలోని ఎ.పి.పేట పంచాయతీ బూర్జమానుగూడ నుంచి గోపిదేవిపేట గిరిజన గ్రామానికి వెళ్తున్న లగేజి ఆటో శుక్రవారం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో తేజేశ్వరరావు, సవర బోడెమ్మ, సవర చందు, సవర బాలకృష్ణకు గాయాలు కావడంతో 108 అంబులెన్సులో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. స్థానిక పోలీసుస్టేషన్ హెచ్‌సీ పి.వి.రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెవెన్యూ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, రెవెన్యూ అసోసియేషన్ సభ్యులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: నూతన సంవత్సరం రెవెన్యూ డైరీ, క్యాలెండర్, ఏపీజేఏసీ అమరావతి క్యాలెండర్‌ను కలెక్టరు స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జానపద గీతాలాపనలో శిరీష ప్రతిభ


శిరీషను అభినందిస్తున్న ట్రిపుల్ ఐటీ అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) ఇంజినీరింగ్ రెండో ఏడాది విద్యార్థిని సూర్నీడి శిరీష జానపద గీతాలాపనలో ప్రతిభ కనబరిచింది. రాష్ట్రస్థాయి యూత్ అఫైర్స్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో జానపద గీతాల విభాగంలో మొదటి బహుమతి సాధించింది. త్వరలో న్యూఢిల్లీలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా శిరీషను డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కె.మోహన్‌కృష్ణ శుక్రవారం అభినందించారు. జాతీయ స్థాయిలోనూ సత్తాచాటాలని ఆకాంక్షించారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు కేశవరావుపేట విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎచ్చెర్ల మండలం కేశవరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూజారి హర్ష అభిరామ్, కొత్తకోట వసంత ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మహారాష్ట్రలోని జలగాన్‌లో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు ఈ పోటీలు జరగనున్నాయి. విద్యార్థులను డీఈవో తిరుమల చైతన్య, హెచ్‌ఎం సాయిరాం, పీడీ ఎంవీ రమణ, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

900 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

మెళియాపుట్టి: గిరిజన గ్రామాల్లో నాటు సారా స్థావరాలపై దాడులు ముమ్మరం చేస్తున్నట్లు టెక్కలి ఎక్సైజ్ సీఐ షేక్ మీరా సాహెబ్ తెలిపారు. శుక్రవారం మెళియాపుట్టి మండలం బాణాపురం పంచాయతీ ఎగువబగడ గ్రామంలో దాడులు నిర్వహించి 900 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. 10 లీటర్ల సారా, తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో టెక్కలి ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్, మెళియాపుట్టి ఎస్సై రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.